# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ వెలిగొండ ప్రాజెక్ట్ ను 2026 నాటికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రంలో 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.
- ❖ ఆదిమ గిరిజన తెగల (పీవీటీజీ) కోసం ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద పెద్ద ఎత్తున గృహ నిర్మాణం జరుగుతోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు.

========================

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2029 నాటికి అందరికీ ఇళ్ళు అందిస్తామని తెలిపారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లిలో ఈ రోజు పర్యటించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో 3 లక్షల ఇళ్ళకు సంబంధించిన గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజావేదిక వద్ద లబ్దిదారులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. భూగర్భ జలాల అభివృద్ధిపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ఉగాది నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 5.9 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేస్తామని తెలిపారు. ఇళ్లు లేని పేదల పేర్లు నమోదు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

వెలిగొండ ప్రాజెక్ట్ ను 2026 నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని.. అందుకు అనుగుణంగా పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్ట్ లో గండి పడిన ఫీడర్ కెనాల్ ను మంత్రి ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...

వెలిగొండ ప్రాజెక్ట్ ను పూర్తి చేసి ప్రకాశం జిల్లా వాసులకు తాగు, సాగు నీరు ఇస్తామని తెలిపారు. ఫీడర్ కెనాల్ పనుల కోసం 480 కోట్ల రూపాయలతో టెండర్ పిలిచామని మంత్రి పేర్కొన్నారు.

========================

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక సౌకర్యాల కల్పనకు పెద్ద పీట వేస్తోందని చెప్పారు. ఐటీ, తయారీ, సేవలు, పర్యాటక రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విశాఖలో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో సుమారుగా 410 వరకూ ఒప్పందాలు కుదురుతాయని భావిస్తున్నామని మంత్రి చెప్పారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని నారా లోకేశ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ఆదిమ గిరిజన తెగల (పీవీటీజీ) కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద 5 వేల 169 ఇళ్లు ఆమోదించగా 4 వేల 263 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నిర్వహించిన 3 లక్షల గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపాలిటీ 12వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాలూరు మున్సిపాలిటీలో మొత్తం 195 ఇళ్లకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 22 వేల 833 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.

========================

సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విశాఖపట్నం చేరుకుంటారు. ఈ నెల 14, 15వ తేదీలలో విశాఖలో నిర్వహించే 30వ సి.ఐ.ఐ. భాగస్వామ్య సదస్సు సన్నాహకాలపై అధికారులు, మంత్రులతో ఈ సందర్భంగా సమీక్షిస్తారు. ఈ రోజు రాత్రి భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కళ్యాణితో చంద్రబాబు నాయుడు సమావేశమవుతారని అధికార వర్గాలు వెల్లడించాయి. విశాఖలో నాలుగు రోజుల పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశాలు నిర్వహిస్తారు. అదే విధంగా వివిధ కార్యక్రమాలకు సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నాయి.

విరామం

========================

భారత పూర్వ ఉప ప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఐక్యతా పరుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా విశాఖ నగరంలోని రామకృష్ణా బీచ్ రోడ్డులో ఈ రోజు నిర్వహించిన ఐక్యతా పరుగు కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు పి. విష్ణుకుమార్ రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అఖండ భారతావని కోసం ఎంతో కృషి చేసిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ నేటి యువతకు స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ను స్ఫూర్తిదాయకంగా తీసుకుని మనమంతా సమైక్యంగా ఉంటూ అభివృద్ధివైపు అడుగులు వేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ పేర్కొన్నారు. అమలాపురంలోని ఎస్ కే బి ఆర్ కళాశాల నుండి గడియార స్తంభం వరకు విద్యార్థులు, నగర వాసులతో ఈ రోజు ఐక్యతా పరుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

========================

విశాఖలో ఈ నెల 14, 15వ తేదీలలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బగ్చి ఆదేశాలు జారీ చేశారు. విశాఖ కంటి ఆసుపత్రి జంక్షన్ నుండి సిరిపురం వైపు వచ్చే సాధారణ వాహనదారులు 14, 15 తేదీలలో విశాఖ కంటి ఆసుపత్రి జంక్షన్ వద్ద డైవర్షన్ తీసుకొని శివాజీపాలెం మీదుగా హైవేకు చేరుకొని తమ గమ్యస్థానాలను చేరుకోవాలని కోరారు. అలాగే, సిరిపురం జంక్షన్ నుండి మూడవ పట్టణం పోలీస్ స్టేషన్ వైపు వచ్చే వాహనదారులు టైకూన్ జంక్షన్ వద్ద డైవర్షన్ తీసుకుని తమ గమ్య స్థానాలను చేరుకోవాలని సూచించారు. ఈ రెండు రోజులు శ్రీకాకుళం, విజయనగరం నుండి  అనకాపల్లి వైపు వెళ్లే అన్ని భారీ వాహనాలు ఆనందపురం జంక్షన్ వద్ద డైవర్షన్ తీసుకొని పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి చేరుకోవాలని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

========================

పత్తి రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని గణపవరంలోని జిన్నింగ్ మిల్లులో ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సిసిఐ నిబంధనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీనికి అధికారులు కూడా సహకరించి వారికి న్యాయం చేయాలని కోరారు.

========================

ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలియచేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

మీ డబ్బు - మీ హక్కు నినాదంతో భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలోని కలెక్టరేట్ లో ఈ నెల 14న ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) కె. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమం ద్వారా పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును బ్యాంకులు అర్హులకు తిరిగి అందించేలా చూస్తామని పేర్కొన్నారు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా నామినీ వివరాల్లో లోపాలు, మరచిపోవడం వంటి కారణాలతో కొన్ని ఖాతాల్లోని డబ్బు లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలో మొత్తం 5 లక్షల 50 వేల 778 బ్యాంకు ఖాతాల్లో 145.47 కోట్ల రూపాయలు ఉన్నట్లుగా ప్రియాంక ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

========================
========================